క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి : మండల పరిధిలోని తూర్పుగూడెం గ్రామానికి చెందిన సంకినేని చిలకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే సామేల్ శనివారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దొంగరి గోవర్ధన్, గుండగాని మహేందర్, దాసరి శ్రీను, దాయం ఝాన్సీ రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సర్వే గడువు పెంచాలి

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే గడువును పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడియం కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఇప్పటి వరకు 70శాతం కూడా పూర్తి కాలేదని తెలిపారు. వలస వెళ్లిన కుటుంబాలు చాలా ఉండటంతో ప్రభుత్వం సర్వే గడువును పెంచాలని కోరారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల పేర్లు సర్వే జాబితాలో లేవని, అలాంటి వారి దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. ఆయనతోపాటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు భిక్షం, వెంకన్న, నర్సయ్య, శ్రీను, రాములు, అంజమ్మ, పద్మ, స్వరూప, మల్లమ్మ, నాగయ్య, మల్లయ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఉత్సవాలలో భాగంగా శనివారం 13వ రోజు పదమూడవ పాశురాన్ని అర్చకులు పఠించారు. అలాగే మహిళలు మంగళహారతులతో ప్రదర్శనగా వచ్చి గోదాదేవికి కుంకుమార్చన చేసి సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యమకారులు తరలిరావాలి

అర్వపల్లి : తెలంగాణ రాష్ట్ర సాధనకోసం పోరాడిన తొలి, మలిదశ ఉద్యమకారుల నియోజకవర్గ స్థాయి సమావేశం ఆదివారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో జరుగుతుందని ఉద్యమకారుల సంఘం నియోజకవర్గ నాయకుడు దిర్శనపు కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి తొలి, మలిదశ ఉద్యమకారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

వంతెన పరిశీలన


వంతెనను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అర్వపల్లి : కొమ్మాల గ్రామ పంచాయతీ పరిధిలోని మర్రిబావితండా రోడ్డు భారీ వర్షాలకు కొట్టుకపోయి రాకపోకలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా ఎఫ్‌డీఆర్ నుంచి రూ.4.80లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో రోడ్డును తాత్కాలికంగా మరమ్మతు చేయించారు. రహదారిపై రెండు చోట్ల వంతెనలు నిర్మించారు. వీటిని శనివారం ఎంపీడీఓ మారుతి సత్యనారాయణరెడ్డి పరిశీలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విశాల్

చివ్వెంల : సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు చివ్వెంల మండల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థి జి.విశాల్ ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ విద్యాసాగర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, హైజంప్ విభాగాల్లో ప్రతిభ కనబర్చినందుకు నిర్వాహకులు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. హనుమకొండలో ఈ నెల 31నుంచి జనవరి 2వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడికి నివాళి

తిరుమలగిరి : కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బందెల రవి శుక్రవారం మృతి చెందారు. రవి పార్థివ దేహానికి పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలకుర్తి రాజయ్య, కాంగ్రెస్ అధికార ప్రతినిధి సంకేపల్లి కొండల్ రెడ్డి, కలీం, శేఖర్, మల్లేష్ ఉన్నారు.

సర్కారు బడులే అడ్డాగా..!

- గ్రామాల్లో మందుబాబులు, ఆకతాయిల ఇష్టారాజ్యం
- పాఠశాలల్లో మద్యం బాటిళ్లు పడేస్తూ, సామగ్రి ధ్వంసం చేస్తూ వికృత ఆనందం
- ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


ఆత్మకూరు పాఠశాలలో పడేసిన మద్యం బాటిల్


విరిగిన పాఠశాల తలుపు

ఆత్మకూర్(ఎస్) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు మద్యం ప్రియులకు ఆవాసాలుగా మారుతున్నాయి. కొందరు ఆకతాయులు, యువకులు పాఠశాలలను అడ్డాలుగా మార్చుకుని మద్యం, గుట్కా, గంజాయి లాంటివి సేవిస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మద్యం సీసాలు పగలగొడుతూ..

పాఠశాలలో మద్యం సేవించిన వారు మద్యం మత్తులో తాగిన సీసాలను పగలగొడుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. కొన్ని గ్రామాల్లో యువకులు పాఠశాలలను అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మార్చుకుంటున్నారు. యువకులు సాయంత్రం కాగానే పాఠశాలలో సిగరెట్, గంజాయి, మద్యం సేవించి అక్కడితో ఆగకుండా పాఠశాలల్లోని తలుపులు, కిటికీలు పగలగొడుతున్నారు. గతంలో మండల పరిధిలోని పలు గ్రామాల పాఠశాలల్లో దొంగతనాలు కూడా జరిగాయి.

తీవ్ర ఇబ్బందులు..

ప్రభుత్వ పాఠశాలల్లో నైట్ వాచ్‌మన్‌లు, స్కావెంజర్లు లేకపోవడంతో ఇప్పటికే పాఠశాలల నిర్వహణ తలకు మించిన భారమై ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఆకతాయిలు, మద్యం ప్రియులు పాఠశాలల్లో సీసాలు పగలగొట్టడం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతుండడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాలలకు పోలీసుల గస్తీ పెంచాలని పలువురు కోరుకుంటున్నారు.

నైట్ వాచ్‌మన్‌లను నియమించాలి

పాఠశాలలకు నైట్ వాచ్‌మన్‌లు లేకపోవడంతో ఆయా గ్రామాల్లో యువకులు మద్యం సేవించడానికి అడ్డాలుగా చేసుకుంటున్నారు. పాఠశాలల్లో ధూమపానం, మద్యపానం చేయడంతోపాటు తలుపులు, కిటికీలు విరగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం పాఠశాలలకు నైట్ వాచ్‌మన్‌లను నియమించాలి.

– నాయని సైదులు, సీఆర్‌పీఎఫ్ సభ్యుడు

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి


నాగారంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

నాగారం : ఆర్థిక సంస్కరణల నిపుణుడు, భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల నాగారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ నాయకులు శనివారం సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగారం ఎక్స్‌రోడ్డులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని అన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా, ఆర్‌బీఐ గవర్నర్‌గా, ఆర్థిక సలహాదారుగా దేశానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. మన్మోహన్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రతాప్, టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొలిపాక సాయి కుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్.వలీ, ఉపాధ్యక్షుడు దేవరకొండ కిరణ్, గంట మహేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తిలో బస్‌డిపో ఏర్పాటు చేయాలి

తుంగతుర్తి : నియోజకవర్గ కేంద్రమైన తుంగతుర్తిలో బస్ డిపో ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మండల నాయకుడు కోతి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తిలో బస్ డిపో ఏర్పాటు చేస్తే అర్వపల్లి, నాగారం, తిరుమలగిరి, మద్దిరాల, నూతనకల్ మండలాల్లోని అన్ని గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. తుంగతుర్తిలో జాతీయ రహదారి ఉన్నందున హైదరాబాద్, ఖమ్మం, వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాలకు బస్సు సౌకర్యం కల్పించవచ్చని తెలిపారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు బస్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెనుకబడిన తుంగతుర్తిలో బస్ డిపో ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో రాకపోకలు పెరిగి అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం


నూతనకల్ : విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దాతలు

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు దాతలు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు చురుకంటి పవన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్, డీజీఆర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.2లక్షల 70వేల వ్యయంతో 60 సైకిళ్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలకు వెళ్లేందుకు సుదూర గ్రామాలకు చెందిన విద్యార్థులు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి సైకిళ్లను అందించడం అభినందనీయమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గవర్నర్ రాంప్రసాద్, చైర్మన్ బాలకోటి, ఎంఈఓ రాములునాయక్, భూరెడ్డి సంజీవరెడ్డి, ఆదర్శ పాఠశాల చైర్మన్ అబీదాబేగం, చురుకంటి సుమతి, ఝాన్సీ, రాజగోపాల్, లక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత


మద్దిరాల : గోరెంట్ల పాఠశాలలో క్రీడా సామగ్రి అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని గోరెంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1993–1994 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షరీఫ్ ఉన్నీసా బేగం మాట్లాడారు. పాఠశాలకు క్రీడా సామగ్రిని అందజేయడం పట్ల పూర్వవిద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమాదేవి, ప్రకాశం, లింగయ్య, పూర్ణచందర్, శ్రీనివాస్, అవిలయ్య, పరమేష్ పాల్గొన్నారు.

1వ తేదీ నుంచి మహిళా పూజారులకు శిక్షణ

అర్వపల్లి : గ్రామ దేవతల ఆలయాల్లో పూజలు చేస్తున్న మహిళా పూజారులకు శాస్త్రీయ పద్ధతిలో పూజ చేసే విధానంపై హైదరాబాద్‌లో జనవరి 1నుంచి 5 వరకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ధర్మజాగరణ సమితి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ బంటు శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు అరుణ తెలిపారు. శిక్షణ తరగతుల విజయవంతానికై శనివారం అర్వపల్లిలో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. హైదరాబాద్‌లోని అన్నోజిగూడ రాష్ట్రీయ విద్యాకేంద్రంలో ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. 25 నుంచి 55 ఏళ్లలోపు మహిళలు ఈశిక్షణ పొందుటకు అర్హులని తెలిపారు. శిక్షణ పొందిన వారికి తెలంగాణ అర్చక పరిషత్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 8309713595, 9705906679 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

పనులు ముమ్మరం చేయాలి

అర్వపల్లి : వనమహోత్సవంలో భాగంగా జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని 17 నర్సరీలలో పనులు ముమ్మరం చేయాలని ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి సూచించారు. శనివారం అర్వపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వననర్సరీలు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే, ఉపాధిహామీ పథకంలో చేపట్టే పశువుల షెడ్లు, ఇంకుడుగుంతలు తదితర పనులపై సమీక్షా జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ టి.గోపి, ఏపీఓ సీహెచ్.ఉపేందర్, ఈసీ నగేష్, టీఏలు యాదమ్మ, నాగమణి, దీపిక, జూనియర్ అసిస్టెంట్ శిల్పిక, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం


నూతనకల్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నూతనకల్ : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ కృషి ఎంతో ఉందని తెలిపారు. ప్రపంచంలో దేశం గొప్పతనాన్ని చాటిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టా మల్లారెడ్డి, దరిపెల్లి వీరన్న, బాణాల సుదర్శన్‌రెడ్డి, పసుల అశోక్ యాదవ్, బొడ్డుపల్లి అంజయ్య, బొల్క సైదులు, నెల్లుట్ల మహేష్, ఉప్పుల పాపయ్య, చురుకంటి చంద్రారెడ్డి, అబ్బాస్‌అలీ, ఇమ్మారెడ్డి మహేష్‌రెడ్డి, సానబోయిన శంకర్‌గౌడ్, మేడిపల్లి అశోక్, సామ ఉపేందర్, కందుకూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు, పాల్గొన్న నాయకులు

చివ్వెంల : హైదరాబాద్‌లో ఫిబ్రవరి 3న నిర్వహించే లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల కళాకారుల కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఎర్ర వీరస్వామి, జిల్లా ఇన్‌చార్జ్ గంటా భిక్షపతి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్గీకరణ కోసం 30ఏళ్లుగా మంద క్రిష్ణ మాదిగా పోరాటం చేస్తున్నారని అన్నారు. కళాకారులు అధిక సంఖ్యలో హాజరై కవాతును విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కళాకారుల సంఘాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా యాతాకుల రఘు, ప్రధాన కార్యదర్శిగా బుచ్చిబాబు ఎన్నికయ్యారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొంగల సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈదయ్య, కిరణ్, స్టాలిన్, లక్ష్మణ్, బుచ్చిబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం


మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

పెన్‌పహాడ్ : రానున్న కాలంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని అన్నారు. శనివారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల్లో అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చి ఉంటే బాగుండేదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు జీర్ణించుకోలేక కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం చేయవద్దని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీకాంత్, వీరబోయిన రవి, మడ్డి అంజిబాబు, బుచ్చిరాములు, కొండమీద రాములు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

భానుపురి : సూర్యాపేట, నేరేడుచర్లలోని ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. శనివారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడారు. సూర్యాపేట పట్టణం కుడకుడ శివారు సర్వే నంబర్ 126 ప్రభుత్వ భూమిలో, నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధి సర్వే నంబర్ 243, 244 ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, జిల్లా నాయకులు పేర్ల నాగయ్య, పార్టీ డివిజన్ నాయకులు ఎస్‌కే సయ్యద్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు చంద్రకళ, సహాయ కార్యదర్శి సంతోషి మాతా, ఉపాధ్యక్షులు సూరం రేణుక, పార్టీ పట్టణ కార్యదర్శి గులాం హుస్సేన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం.. మరమ్మతులు శూన్యం


బురదమయంగా ఉన్న చీదెళ్ల - చెట్లముకుందాపురం రహదారి


- ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోని గ్రామీణ రహదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పెన్‌పహాడ్ : మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. బీటీ రోడ్లు నిర్వహణలేక పూర్తిగా దెబ్బతిన్నాయి. గ్రామాలను కలుపుతూ ఉన్న అంతర్గత రోడ్లు మరింతగా అధ్వాన స్థితికి చేరుకున్నాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని రోడ్లపై ప్రయాణించడం ప్రజలకు నరకయాతనగా మారింది. రోడ్లను బాగుచేయించడంలో సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఏ మాత్రం పట్టింపులేకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాలకు రోడ్లపై గోతులు ఏర్పడ్డాయి. రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు కమ్ముకొని బండ్ల డొంకలను తలపిస్తున్నాయి.

దెబ్బతిన్న రోడ్లు..

మాచారం నుంచి పొట్లపహాడ్ వెళ్లే రోడ్డు వెంట కంపచెట్లు కమ్ముకున్నాయి. అనాజీపురం నుంచి దోసపహాడ్, చీదెళ్ల నుంచి తంగెళ్లగూడెం వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. చీదెళ్ల నుంచి చెట్లముకుందాపురం వెళ్లే రహదారిపైకి పంట పొలాల నీరు చేరుతున్నాయి. దీంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దూపహాడ్ నుంచి చెట్లముకుందాపురం వరకు రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. న్యూ బంజారాహిల్స్ తండా నుంచి గాజులమల్కాపురం వరకు ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. అనంతారం క్రాస్ రోడ్డు నుంచి మహ్మదాపురం వరకు రోడ్డుపై కంకర తేలి వాహనదారులు వెళ్లడానికి కష్టంగా ఉంది. పలు గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు కమ్ముకొని ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా గ్రామీణ రహదారులకు మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



మండలంలో ఉన్న పంచాయతీ రాజ్ పరిధిలోని రోడ్ల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు మొదలు పెడతాం. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. రోడ్ల వెంట పెరిగిన కంపచెట్లను తొలగిస్తాం.

– శ్రీకాంత్ రెడ్డి, పీఆర్ ఏఈ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నూతనకల్ : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్‌కుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నూతన టవర్‌ల నిర్మాణంలో భాగంగా మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. చిల్పకుంట్ల, వెంకెపల్లి గ్రామాలకు పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

తుంగతుర్తి : మండల పరిధిలోని వెలుగుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈఈ సురేందర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీఓ గోపి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో ఇప్పటి వరకు 6వేల ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తయిందని మండల పంచాయతీ అధికారి టి.గోపి తెలిపారు. మండలంలోని వేల్పుచర్ల, సీతారాంపురం, జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి, పర్సాయపల్లి తదితర గ్రామాల్లో శనివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. మండల వ్యాప్తంగా ప్రజాపాలనలో 9,070 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. దరఖాస్తుదారులు ఇళ్ల వద్ద అందుబాటులో ఉండి సర్వే చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు కృష్ణవేణి, నవీన్‌రెడ్డి, నెహ్రూనాయక్, దస్తగిరి, నాగయ్య, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

చివరి పంటలకు నీరందేనా?

- కంపచెట్లతో నిండి అధ్వానంగా మారిన ఎస్సారెస్పీ కాలువలు
- చివరి ఆయకట్టుకు సాగు నీరు అందక ఆందోళన చెందుతున్న రైతులు


కంపచెట్లతో నిండిన 71డీబీఎం కాలువ

అర్వపల్లి : యాసంగి పంటలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు జనవరి 1 నుంచి విడుదల కానున్నాయి. అయితే ఎస్సారెస్పీ కాలువల పరిస్థితి మాత్రం అధ్వానంగా మారింది. కాల్వలు కంపచెట్లతో నిండడంతో నీళ్లు సాఫీగా వెళ్లని పరిస్థితి నెలకొంది. చివరి భూములకు నీరు అందడం గగనంగానే మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

18 వేల ఎకరాలకు..

జాజిరెడ్డిగూడెం మండలంలో 18వేల ఎకరాలకు ఎస్సారెస్పీ నీళ్లు అందనున్నాయి. రైతులు ఈ నీటి పైనే ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు. కానీ కాలువల నిర్మాణం జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు లైనింగ్ పనులు చేపట్టకపోవడంతో ఎక్కడి నీళ్లు అక్కడే ఆగిపోతున్నాయి. మండలంలోని పర్సాయపల్లి నుంచి తిమ్మాపురం వరకు 71డీబీఎం కాలువ ఉంది. ఈ ప్రధాన కాలువతోపాటు మైనర్లు, సబ్‌మైనర్లు నిర్మించారు. కానీ కాలువలో ప్రస్తుతం పిచ్చిమొక్కలు, కంపచెట్లు నిండి ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు కాల్వల్లో కంపచెట్లను తొలగించాలని, ఈ సీజన్ పూర్తయ్యాక లైనింగ్ నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న ఆలకుంట్ల బాలకృష్ణ

నాగారం : తుంగతుర్తి మండల పరిధిలోని బండరామారం గ్రామానికి చెందిన ఆలకుంట్ల వీరస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు, ఫణిగిరి గ్రామానికి చెందిన ఆలకుంట్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో సంఘం నాయకులు శనివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

నకారా సేవలు మరువలేనివి


రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కోదాడరూరల్ : రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ కోసం డీఎస్ నకారా చేసిన సేవలు మరువలేనివని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతా రామయ్య అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్‌లో నిర్వహించిన జాతీయ పెన్షనర్ల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సుదీర్ఘకాలంగా ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులకు పెన్షన్ లేకపోవడం సరికాదని భావించి నకారా న్యాయస్థానానికి వెళ్లి పెన్షన్ తీసుకొచ్చారని తెలిపారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 70 సంవత్సరాలు నిండిన వారితో పాటు డిసెంబర్‌లో పుట్టినరోజు జరుపుకుంటున్న వారిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సెక్రటరీ బొల్లు రాంబాబు, వెంకటేశ్వర్‌రావు, రఘువరప్రసాద్, విద్యాసాగర్, అమృతా రెడ్డి, పొట్టా జగన్మోహన్‌రావు, ఖలీల్‌అహ్మద్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఇన్సూరెన్స్ తప్పనిసరి

హుజూర్‌నగర్ : డ్రైవర్లు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని టీఆర్ఎస్‌కేవీ నాయకుడు పి.ఉపేందర్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌పట్టణంలో నిర్వహించిన మినీ ట్రాన్స్‌పోర్ట్, ట్రాలీ ఆటో యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులు సూచించిన విధంగా తమ వాహనాలకు వీసీ నంబర్లు వేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాగేంద్రబాబు, శ్రీనివాస్, వీరమల్లు, గౌస్, మంగయ్య, నరేష్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.